(ఆంధ్రజ్యోతి వీక్లీ 15-7-1973)

దేవుడుచేసిన మనుషుల్లారా· మీ పేర్లేమిటి?

"ఏం. మీ దేవుడు ఇలా చేసేడు?"

ఉలిక్కిపడింది అనూరాధ. భర్త వర్క్‌షాపునుంచి వచ్చేవేళ కాదు. తను ఊర్నించి వచ్చినట్టు తెలుసుకొని ఓ గంట ముందుగా బయల్దేరి వచ్చేశారన్నమాట, ఆర్నెల్ల తరవాత తన ఇంటికి తనువస్తే అదీ మొదటి ప్రశ్న.

'నేనొచ్చానని కబురు తెలిసిందాండి ?' అన్నది తల వొంచుకొని.

'మరే. మీ నాయనగారు స్టేషనుకి వెళుతూ వర్క్‌షాపు దగ్గిరకొచ్చి రాత్రికి ఉండలేక పోతున్నానని క్షమార్పణలు చెప్పుకుని వెళ్ళారు. ఒక్కతెవూ ఉన్నావని వెంటనే వచ్చేశాను.'

"నాన్నగారికి రేపట్నుంచి ఎవరో ఆఫీసరు క్యాంపు ఉందటండి. మీరేమో తప్పకుండా ఇవాల్టికే నన్ను దిగబెట్టెయ్యమని ఉత్తరం రాసేరు. మా అన్నయ్యకు వీలుగాలేదు."

"అన్నీ చెప్పారు....అంతా బాగున్నారా మీ వాళ్ళు? తమ్ముళ్ళు, చెల్లాయిలు" అని యథాలాపంగా అనేసి జవాబుకోసం నాకంత పట్టింపు లేదన్నట్టుగా ముందుకు వెళ్ళాడు సన్యాసిరాజు.

పలకరింపులో ఆప్యాయత లేకపోవడం గమనించి సమాధానానికి మాటలు ఖర్చు పెట్టకుండా తల వూపింది అనూరాధ.

గదిలో ఒకమూల దూలానికి చిన్న హూక్ లాంటిది వుంది. దానికి చిన్న కొబ్బరితాడు వేలాడేసి, మెత్తని చీరతో ఒక ఉయ్యాల వేసింది అనూరాధ అందులో అయిదో నెలలో అడుగు పెట్టిన పాప నిద్రపోతోంది.

అక్కడిదాకా వెళ్ళి కిందినుంచి పైదాకా చూసేడు సన్యాసిరాజు. బూట్లు విప్పుకోడానికి వంగాడు.

చకచకా అతని దగ్గర కెళ్ళింది అనూరాధ. బూట్ లేసులు వదులుచేసి సాయంచేసింది. "కాళ్ళు కడుక్కుని రండి పాపని చూద్దురుగాని" అంది తల వంచుకొనే.

"కడుక్కోకపోతే చూపించవా?"

"ఊఁహూఁ" అని ఉయ్యాల కడ్డంగా నిలబడి చిరునవ్వు నవ్వి భర్తవేపు మెత్తని చూపు విసిరింది అనూరాధ.

సన్యాసిరాజు కోపం తెచ్చుకోకుండానే "అలా అయితే నేను చూడనే చూడను" అన్నాడు.

క్షణంలో అనూరాధ ముఖం మాడిపోయింది. "మీరు హాస్యానికైనా అలా అనకూడదండి" అన్నది.

"సారీ——" అని రాజు లోపల వరండాలోకి వెళ్ళాడు.

అప్పుడు మళ్ళీ ఆమెకి అతను మొదట ఇంట్లో అడుగు పెడుతూ అడిగిన ప్రశ్న జ్ఞాపకాని కొచ్చింది. ఆ ప్రశ్న మళ్ళీ అడుగుతాడని భయంగా వుంది.

........అవును దేవుడిలా చెయ్యడం అన్యాయం. తొలికాన్పు మొగబిడ్డ కావాలని అందరూ అన్నారు. అమ్మకి తొలికాన్పు మొగబిడ్డ. అమ్మమ్మకి అంతే. అత్తగారికి, వారత్తగారికీ అంతే. తనకి ఆడపిల్ల పుట్టింది. దేవుడు ఎందుకిలా చేసేడో?

బాబు పుడితే పేరుపెట్టి నీ కొండకి తీసుకొస్తామని వేంకటేశ్వరస్వామికి మొక్కుకుంది. కలిసి మొక్కుతే కనికరిస్తాడని ఆయన్ని చెయ్యికలిపి మీదు కట్టమంది. ఆయన ఆవేళే వేళాకోలంగా మాట్లాడారు.

ఆయన గారు మొక్కుతే అబ్బాయి పుట్టేవాడేమోనని అనిపించని రోజు లేదు; ఈ నాలుగు నెలల్లోను "ఆడపిల్లయితేనేం పాప బంగారు పాప. ఎంత ముద్దొస్తోందో" అని ఎంతమంది పాపని పొగిడినా ఊరట కలగలేదు.

హాస్పిటల్లో గాని చుట్టుపట్ల ఇళ్ళలో గాని అంత చిన్న వయస్సుకి అంత పుష్టిగా వున్న పాప ఎన్నడూ కనబడలేదు. ఎనిమిది పౌన్లు పుట్టిందట. ఇప్పుడు పన్నెండు పౌన్లు.

"ఆ వూరుకెళ్తే మెకానికల్‌గా అయిపోతావు" అని మొన్నరాత్రి సినిమాకి తీసుకుపోయారు తమ్ముళ్ళూ. చెల్లెళ్ళూ. పాపని అమ్మకి అప్పగించి వెళ్ళారు. సినిమాలో ఏదో ఎడ్వర్‌టయిజ్‌మెంటులో ఉన్నాడొక బాబు. సరిగ్గా పాపలానే ఉన్నాడు. "నెలరోజుల్లో మీ పాప అంతదౌతుంది" అని అన్నయ్య అంటే ఒళ్ళు పులకరించినా మనసు కలుక్కుమంది....

కాళ్ళు కడుక్కొని వచ్చాడు సన్యాసిరాజు.

పాపని చూపిస్తానన్నావు; చూపించు అన్లేదు. "పన్లు అవీ చేసుకోగలవా, మా నారాయణత్తయ్యకి కబురు పెట్టనా?"

సమాధానం చెప్పలేదు అనూరాధ. "పాపని చూద్దురుగాని రండి" అని నవ్వుతూ ఉయ్యాల వెడల్పుచేసి పట్టుకొంది.

"బుద్ధిజాడ్యం తలకెక్కిందే" అని నవ్వుతూనే ఉయ్యాలలోకి తొంగి చూశాడు రాజు. ఉయ్యాల వెడల్పు చేయడంతో పాపకి నిద్రలో ప్రశాంతతకి భంగం కలిగింది. మొహంలో చిరాకేర్పడింది.

"అబ్బో! మీ నాయనగారి కున్నంత చిరాకుందే" అని పెళ్ళాంతో హాస్య మాడేడు సన్యాసిరాజు.

"మా నాయనగారు మీ మీద ఎప్పుడు చిరాకు పడ్డారండి?" అన్న ప్రశ్న నాలుక చివరివరకు వచ్చింది అనూరాధకి.

* * *

అనూరాధకి పద్దెనిమిదో సంవత్సరం. పదిహేడో ఏట పెళ్ళి చేసేరు. సన్యాసిరాజు ఆటోమొబైలు ఇంజనీరింగులో డిప్లొమా తీసుకున్నాడు. వాళ్ళ బంధువులెవరో కార్లూ, లారీలూ రిపేర్ చేసే వర్క్‌షాపు పెడితే అందులో కొంత డబ్బు పెట్టాడు. అక్కడా అక్కడా వుద్యోగం చేసి పానకం తాగేకంటే ఈ వర్క్‌షాపునే వృద్ధిలోకి తెచ్చి కలో గంజో తాగితే మంచిదని సన్యాసిరాజు అందులోనే కుదురుకున్నాడు, పెట్టుబడి మీద లాభం వస్తోంది. పని చేసినందుకు జీతం. అనుభవం, పేరు వస్తున్నాయి, కష్టపడి పని చేయడం తెలుసు. స్వశక్తి మీద స్వయంకృషి మీద ఉన్న నమ్మకం ఏ ఇతర లౌకిక అలౌకిక శక్తులమీదా లేనివాడు. తీరిక వుంటే సరదాగా వుండగలడు కాని సరదాకోసం తీరిక చేసు కోడు.

0 0 0

"ఇవాల్టికి నేను టిఫిన్ హోటల్లో తీసుకుంటాను. రేపట్నుంచీ ఇంటి దగ్గర చేద్దువుగాని" అన్నాడు బట్టలు వేసుకుంటూ సన్యాసిరాజు.

"ఇవాళ్నుంచే చేస్తానండి. ఇదిగో అయిపోయింది పూజ. ఆర్నెల్లనుంచి దేవుడిదగ్గర దీపం లేదని అవన్నీ శుభ్రం చేసుకుంటూ కూర్చున్నాను. ఎంత పెందలాడే లేచినా లేటయిపోయినట్టుంది."

"ఐతే ఎంత సేపటికవుతుంది?" వాచీవేపు చూసేడు సన్యాసిరాజు. "నా కింకా ఇరవయి నిమిషాలు మాత్రం టైముంది."

"ఎంత సేపో ఎందుకండి?.... ఐదు నిమిషాలంతే-అయినా ఏ గవర్నమెంట్ ఉద్యోగస్తుల్లా-" అని ఆమ్లెట్ వెయ్యడానికన్నీ సిద్ధం చేసుకుంటూ, చిరునవ్వుతో వోరగా చూసింది అనూరాధ.

సన్యాసిరాజు కఠినంగా చూశాడు. "ఊఁ- కానియ్యి, గవర్నమెంటు ఉద్యోగస్థుల సంగతి నాదగ్గర ఇప్పుడంటే అన్నావుగాని ఇంకెప్పుడూ అనకు. టైమ్ ఎప్పుడవుతుందా అని చూడ్డమే తప్ప పని ఏమాత్రం అయిందని చూడరు .... నేను టైమ్ ప్రకారం వెళ్తున్నది ఏదో టైమ్-సెన్స్ కోసం కాదు. నా వర్కర్స్ నాకన్నా ముందు వర్క్-షాపులో అడుగు పెట్టడానికి ల్లేదు!"

అది నిజమేనని అనూరాధకి తెలుసు.

"పాపకి ఏం పేరు పెడదామండి ?" అన్నది అనూరాధ; ఆమ్లెట్ ప్లేటు రాజీకి అందిస్తూ.

"ఇప్పట్నుంచీ పేరెందుకు?"

"పేరెందు కేమిటి; పిలుచుకొందుకు!"

"ఇప్పుడావిడగార్ని పేరుబెట్టి పిలవకబోతే పనులు జరగవా?"

"అదేమన్న మాటండి!.... ఎప్పటి ముద్దు ముచ్చట్లప్పటివీ!— పదకొండోరోజు నాడు నామకరణం అన్నారు కదా. అప్పుడు ఇప్పుడేకాదు ఇరవై ఒకటన్నారు. ఇరవై ఒకటోరోజున మీరు రావడమే ఆలస్యమైపోయింది. కానివ్వండంటే కానివ్వడంటూ తంతు జరిపించేరు. పేరేమిటి పెడతారని నలుగురూ అడిగితే నావేపు మీరూ. మీవేపు నేనూ చూసుకున్నాం. ఆలోచించుకుని పెడతాం అన్నారుగా— ఈ ఆలోచన ఎప్పటికి తెగేట్టు?"

"ఆలోచన అంటే, నా ఒక్కడిదా!" అని సన్యాసిరాజు చెయ్యి కడుక్కున్నాడు.

"నా ఆలోచన అయింది" అని తువాలందించింది అనూరాధ.

"అదా సంగతి! అందుకోసమని నా మీద దండయాత్ర ప్రారంభించేసన్నమాట" గది మూలకి వెళ్ళి చెప్పులు తొడుక్కున్నాడు సన్యాసిరాజు.

"కాని ఆలోచన అంటే నా ఒక్క దానిదీకాదు కదా" అని నవ్వింది అనూరాధ.

"బలే బలే! చిలక మాటలు నేరుస్తోంది" బుగ్గమీద చిటికె వేశాడు రాజు.

"సరేగాని. నేను ఒంటిగంటకి వస్తాను. తెలుసుగా! వస్తే ఇరవై నిమిషాలు వుంటాను. అదీ గుర్తుందనుకుంటాను.... అప్పుడు మళ్ళీ సెషన్స్ ప్రారంభం... టాటా!"

"ఇంతే............ ఇలా మెకానికల్‌గా బ్రతకవలసిందే—" అనుకుంది అనూరాధ.

o o o

నలభై రోజులైంది.

తెల్లవారక మునుపే మెలకువ వచ్చింది సన్యాసిరాజుకు. అనూరాధ స్నానం చేస్తున్న చప్పుడు వినిపించింది. తనకే చలివేసినట్లు వణికాడు.... ఇవాళ శనివారం కాదే అనుకుంటూ బద్ధకంగా దొర్లాడు. ఓరగా వేసున్న తలుపు చప్పుడుకాకుండా తెరిచింది అనూరాధ. చప్పుడైతే కాలేదుగాని వెలుతురు మాత్రం సన్యాసిరాజు కళ్ళలో సూటిగా పడింది. కళ్ళు తెరిచాడు. "లేచారా" అన్నది అనూరాధ ఆ కళ్ళలోకి చూస్తూ తలుపుమూస్తూ. తడిగుడ్డతో పూజగదిలోకి వెళ్తున్న అనూరాధను గమనించాడు రాజు. "తొందరగా మొహం కడుక్కోండి; నాతోబాటు బోర్నవిటా తాగుదురుగాని" అంటూ వెళ్ళింది.

ఐదు నిమిషాలు అతనలా కదలకుండా పడుకున్నాడు.

అనూరాధని రెండు మూడు ప్రశ్నలడగాలని దాదాపు ఇరవై రోజుల నించీ అనుకుంటున్నాడతను. పగలంతా డ్యూటీ సరి పోతోంది, రాత్రి సంభాషణలు కూడా అదోరకంగా అనూరాధే నడిపిస్తున్నట్టు అయిపోతున్నాయి. అసలు ఏ నిమిషం కూడా తను మాట్లాడేదేదైనా ఉండవచ్చునని ఆమె అనుకోదు.... ఏదో ఒక విషయం సంభాషణలోకి తెచ్చి ఇరవై నాలుగు గంటలూ ఇదే నా బాధ అన్నంతగా ప్రాముఖ్యం ఇచ్చి మాట్లాడుతుంది. అందుచేత ఆమెని ఈ ప్రశ్నలడగాలన్న సంగతి జ్ఞాపకమే రాదు, తీరా గుర్తొచ్చే వేళకి సరైన భాష దొరకనట్టు ప్రశ్నలు గొంతుకలోనే వుండిపోతాయి.

పూజగదిలో చిరుగంట మోగింది.

అలారమ్ అయినట్టు లేచాడతను. గబ గబా పళ్ళు తోముకుని మొహం కడుక్కున్నాడు. తడి మొహంతో లోపలికొస్తుండగా పూజ గదిలోంచి తడిగుడ్డతో, హారతి పళ్ళెంతో అనూరాధ ఎదురైంది. 'హారతి కళ్ళకద్దుకోండి'

అన్నట్లుగా పళ్ళెంముందు జాపింది. అతను నవ్వుతూ చెయ్యి పళ్ళెంనుంచి మొహంవేపుకి ఆడించాడు. "మరి కాస్త కర్పూరమో ఏదో వేసి ఆ పళ్ళెం ఇలాగిచ్చెయ్. చలికాచుకుంటాను" అన్నాడు.

"మీలాంటి వాళ్ళకి అంతేగా మరి. హారతితో చలికాచుకుంటారు. ప్రసాదంతో ఆకలితీర్చుకుంటారు. తీర్థంతో జలకాలాడుతారు"

"హారతుల్తో ఇళ్ళు కాల్చేవాళ్ళ మాటేమిటి?" అన్నాడు సన్యాసిరాజు.

"ఊరుకోండూరుకోండి" అంటూ పళ్ళెం తీసుకొని ఉయ్యాల మంచం వేపెళ్ళింది అనూరాధ.

రెండు నిమిషాల్లో చేతిలో బోర్న్‌విటా గ్లాసు తెచ్చి స్టూల్‌మీద పెట్టింది. సన్యాసి రాజు ఈజీచైర్‌లో కూర్చుని స్టూలుమీద ట్రాన్సిస్టర్‌లో ఏదో స్టేషను కోసం ప్రయత్నిస్తున్నాడు.

అనూరాధ అతని కాళ్ళ దగ్గర నేలమీద కూర్చుని పాదాలు కళ్ళకద్దుకుంది.

"నా జీవితం చివరికొక బెంగాలీ నవల అయిపోయేటట్టుంది" అన్నాడు సన్యాసిరాజు. "అది సరే కాని, ఇవాళ శనివారం కాదుకదా. ఈ జాతరంతా ఏమిటి?" అన్నాడు గ్లాసు తీసుకుంటూ.

"ఏం శనివారం తప్ప నేను స్నానం చెయ్యడం లేదంటారా?"

"అమ్మబాబోయ్ అంత జోకు నీ మీద వెయ్యలేను- అది కాదూ; ఈతడి గుడ్డలూ, హారతి ఇవన్నీ రోజువారీ పద్దులు కావుగా.... పైగా నా కెందుకూ సాష్టాంగపడ్డం?"

"ఏం పడకూడదా.? దేవుడి తరవాత దేవుడంతటి వారుమీరు."

"అయ్యో ఇంతేనా, నా స్టేటస్సు? నేనే దేవుడికన్నా గొప్పవాణ్ణనుకుంటున్నాను, కనీసం నీ వరకు!"

"అదీ నిజమే అనుకోండి; అందుకే సాష్టాంగపడ్డా ననుకోరాదా?"

"అసలు సంగతి చెప్పేవేకాదు."

"అదా? అది నేను చెప్పకుండా మీరు తెలుసుకోలేరా?.... మళ్ళీ మాట్లాడితే తారీకులూ గంటలూ పంక్చువాలిటీ అని లెక్చర్లిస్తారే!" అని దొంగ చూపులు చూసుకుంటూ లేచి పారిపోయింది అనూరాధ.

"అమ్మబాబోయ్. చంపేశావు!" అని ట్రాన్సిస్టరు ఆఫ్ చేసేసి కుర్చీలో వెనక్కి చేరబడి పోయాడు సన్యాసిరాజు.

కాలు తగిలి బోర్నువిటా గ్లాసు కింద పడిపోయింది.

'అరె!' అనుకున్నాడతను. లేటుగా,

ం ం ం ం

సన్యాసిరాజుకి దిగులుగా వుంది. సిగ్గుగా ఉంది. భయం పట్టుకుంది. తన మీద తనకే అసహ్యం వేసింది. తనకింకా ఇరవై మూడేళ్ళు. తన వయస్సువాళ్ళు చాలామంది పెళ్ళి కాకుండానే వున్నారు మొగవాళ్ళదాకా యెందుకు; ఆడపిల్లలున్నారు. ఇరవైమూడేళ్ళవాళ్ళు పెళ్ళికాని వాళ్ళు కొల్లలు! తనకి అప్పుడే ఇద్దరు పిల్లలా! పోనీ ఇప్పుడు కాకపోతే ఆర్నెల్లలో!

సన్యాసిరాజుకి పెద్దగా చదువుకున్న వాళ్ళుగాని సంస్కారంతో జ్ఞానంతో ధగ ధగ లాడిపోతున్న వాళ్ళుగాని స్నేహితులూ బంధువులూలేరు. అతని వంశంలో ఎక్కువమంది పదేసిమంది బిడ్డల తండ్రులే. భూమీపుట్రా గొడ్డూగోదా పుష్కలంగా వుంటే మనవాళ్ళు పదిమంది వుండడం సంపద. ఆ సంప్రదాయం కల బిడ్డడే అతనూనూ.

కాని మొదటిసారి అనూరాధ తల్లి కాబోతున్నదని తెలిసినప్పుడు అటువాళ్ళూ ఇటువాళ్ళూ బంధువులంతా సంతోషించినా అతనికెందుకో సంతోషం కాలేదు. ఏదో నేరం చేసినట్టే బాధపడ్డాడు. ఆ నేరానికి తనని ప్రోత్సహించి తనని ఇరవయి రెండేళ్ళకే తండ్రిని చేసేసిందని అనూరాధ మీదకోపం కూడా వచ్చిందతనికి. ఇంక తను 'కుర్రాడు' కాదు. 'తండ్రి!' బాధ్యతలు స్వీకరించడానికి భుజాలు గట్టిపడుతూనే ఉన్నా 'కుర్రతనం' వదలనివాడే కదా తను!.... కాని కుర్రతనం తననుంచి బలాత్కారంగా వదలిపోతున్నది.

పాప పుట్టిందని మనిషిచేత ఉత్తరం పంపేరు మామగారు. దాంట్లో పదకొండో రోజున నామకరణం చేసుకోడం మంచిదని రాసేరు. బంధువులందర్నీ పిలుస్తున్నాము; మీ అంగీకారం తెలియజెయ్యమని రాశారు. 'వద్దు వద్దు పదకొండు వీల్లేదు. ఇది కొన్నాళ్ళు వాయిదా వెయ్యండి' అన్నాడతను. ఎ ళ్ళి వాయిదా వెయ్యడం ఎలా వీలవుతుంది నాయనా. అంతగా నీకు పదకొండోనాటికి వీల్లేకపోతే ఇరవై ఒకటోనాడు చేద్దాం అని మామగారు స్వయంగా ... కొట్టించి వెళ్ళాడు.

ఇరవై ఒకటోనాడు వెళ్ళాడు గాని ముద్దాయి విచారణకోసం వెళ్ళినట్టే

వెళ్ళాడుగాని, ఏదో ఘనకార్యం చేసిన వాడిలా వెళ్లలేదు.అతిచిన్న వయస్సులో తండ్రి అయిపోయి, తనని నమ్మి తన ఇల్లాలుగా స్నేహితురాలుగా వచ్చిన అనూరాధ అనే ముద్దరాల్ని తల్లిని చేసి, అపరిశుభ్రమైన ఈ నేరం చేసి, అయిన వాళ్ళందరి దగ్గరా తగుదునమ్మా అని ఎలా నిలవాలి? ఇది నేరం కాదా! అనుకున్నాడతను.

"అవును, నేరమే. కాని కాగ్నైజబుల్ అఫెన్స్ కాదు" అన్నాడు అతనికి కొత్తగా పరిచయం అయిన ఒక లాయరుమిత్రుడు. "తెలిసీ తెలియని వయస్సులో పిల్లల్ని ఉత్పత్తి చేస్తున్న మీలాంటి కుర్రకారందరూ దేశం,కాలం, మీ ఒక్కళ్లవే అనుకొని, దేశపు సాంఘిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నేరమే చేస్తున్నారు" అన్నాడతను.... ఇరవయి ఒక్క సంవత్సరాల వయస్సు లేని స్త్రీ పురుషులకి వోటుచేసే హక్కు లేనట్లే. ఏ ఇరవయి అయిదేళ్లో లేని స్త్రీలకి బిడ్డల్ని కనే హక్కు-కూడా లేకుండా ఏదైనా ఒక గట్టిశాసనం వుంటే బాగుండు నన్నాడు.... అతనెంతో తెలివిగలవాడులా కనిపించాడు.

తనూ, అనూరాధా, మధ్యపిల్లలు.వాళ్లు పుట్టడం, వాళ్ళకి పేర్లు పెట్టడం, వాళ్ళ పెంపకం-ఈ సంగతులన్నిటిమీదా అనూరాధతో మాట్లాడాలని వుంటుంది. కాని తీరా మొదలెట్టేవేళకి ఏదో చిరాకు కలిగి సంభాషణ సాగదు. ఆ మిత్రుడి మాటలు తన నోట్లోకి తెచ్చుకుని అనూరాధతో వాదించాలని అనుకుంటాడు. కాని అనూరాధ అతన్ని వాదించనివ్వదు. తనకీ ఉద్దేశాలున్నాయని చెబుతూనే తనకి వ్యక్తిత్వం లేనట్టు నిశ్శబ్దంగా మాట్లాడుతుంది. వాదించడానికి ఇద్దరుం డాలి; అంతేకాక ఆ ఇద్దరిమధ్య కొంత నిర్మొహమాటంగా మాట్లాడుకో గల పరి చయం వుండాలి!

అనూరాధతో ఏ విషయం మాట్లాడినా సంభాషణ ఎలాగెలాగో అయి చివరికి పాపకి పేరు పెట్టడం అనే సమస్యమీద గింగిర్లు కొడుతుంది. ఈ పాప పేరు ఇప్పటిదాకా తేలలేదు. ఈ పాప పుట్టడమే అనవసరం అన్నట్టుగా తన మనస్సు చీకటిలోకి ఉక్రోషంలోకి నిశ్శబ్దంలోకి వెళ్ళిపోతుంది. ఆమెకి మాత్రం ఇదోసజీవసమస్య, అమ్మ పేరు పెట్టాలా, అమ్మమ్మ పేరుపెట్టాలా. అత్తగారి పేరుపెట్టాలా అని ఇరవైనాలుగుగంటలూ సతమతమై సలహాలు కోరుతూ వుంటుంది, కంచి కామాక్షి, మధురమీనాక్షి, బెజవాడ కనకదుర్గా ఎవరెవరో కనబడుతూవుంటారు కలల్లో, ఈ పాపకి తమతమ పేర్లు పెట్టించుకోవాలని,

"ఈ పిల్ల పేరు తరవాత పెడదాం, మళ్ళీ మన కిప్పుడప్పుడే పిల్లలు వద్దు" అని చెప్పాలనుకుంటాడు, "డాక్టరు దగ్గరికి వెళదాం" అని మొహమాటపడుతూ నిర్ణయించుకొనే వేళకే; మళ్ళీ కొంపమునిగింది.

* * *

"ఏమంటున్నాడు, మీ దేవుడు?"

ఉదయం ఎనిమిదిన్నరైంది. ఆదివారం రెండోసారి కాఫీ ఇంటిదగ్గరేగా పుచ్చుకొంటూ, పక్కనే నిలబడ్డ అనూరాధని పలకరించేడు సన్యాసిరాజు.

అనూరాధ స్నానంచేసి పూజ ముగించి నారచీరలోంచి మడతచీరలోకి ఇప్పుడే మారింది. అతని ప్రశ్నలో ఏదో హేళన వుందని స్పష్టంగా తెలుస్తోంది. దానికిసమాధానం యిస్తే తను ఆ హేళనని అంగీకరించడం ప్రోత్సహించడం కూడా అవుతుందన్నట్లు నిశ్శబ్దంగా ఉండిపోయింది.

పైట పూర్తిగా కప్పుకుని అప్రయత్నంగా కిందికి చూసుకుంది. ఎత్తుగా వస్తున్న పొట్ట ఆకారం గమనించి అప్పుడే చాలామంది పుట్టబోయే బిడ్డగురించి ఊహల ఊయల లూపుతున్నారు. మగా, ఆడా?....అతని వేపొకసారి చూసి మళ్ళా తలదించుకుంది.

"నేనన్నమాట బోధపళ్ళేదా?" అన్న ధోరణిలో "ఈ మారైనా అబ్బాయి నిస్తానంటున్నాడా" అన్నాడు సన్యాసిరాజు.

"ఇస్తాడంట, మిమ్మల్ని స్వయంగా అడగమంటున్నాడు" అన్నది అనూరాధ. వోరకంట అతన్ని గమనిస్తూ, "నేనుసరదాకంటున్నాగా" అని స్ఫురించడానికి వీలుగా మొహాన చిరునవ్వు తేలింది.

"ఆశలు పెట్టి దండాలు పెట్టించుకుంటాడు. బెదిరించి, జబ్బులు తెప్పించి లంచాలు వాసూలు చేసుకుంటాడు. మీదేవుడు నిజంగాదేవుడేనా, లేక యేదైనా రాజకీయ నాయకుడి వాటమా?"

".... ...., ..."

"దండాలు పెట్టకపోతే యేంచేస్తాట్ట?"

"దండాలు పెట్టక దైవాలు దారికిరారు.... వాళ్ళ లారీలూ నీళ్ళ లారీలూ బాగుచేసి డబ్బులు కూడబెడుతున్నారుగా. ఏమాత్రం పోగుచేస్తారో చెయ్యండి. కట్నాలు, కట్నాలు పోసి చేద్దురుగాని అమ్మాయిల పెళ్ళిళ్ళు!"

"అబ్బోసి! చాలా కోరిక లున్నాయే, చిలక్కి!"

"మీకు లేవాండీ కోరికలు?"

"ఎందుకుండవూ? కాని దండాలు పెట్టీ లంచాలు పోసీ నా కోరికలు తీర్చు కోను."

"దండాలకి లొంగని దేవుళ్ళు దడిపింపులకి లొంగుతారా?"

"నేనూ లొంగను!"

కాఫీతాగడం అయింది. గ్లాసుకింద పెట్టబోయాడు. దగ్గరగా వెళ్ళి అందు కుంది. ఆ చర్యతో వినయం శరీరంలోంచి మనస్సులో కెళ్ళింది.

"ఈ ఒక్కసారికీ మీరు దండం పెట్టండీ-?" అని ప్రాధేయంగా అడిగింది.

"పెట్టనూ, పెట్టనూ, పెట్టను."

"నామాట వినండీ—— మీరు అడిగితే తప్పకుండా అబ్బాయి పుడతాడు మనకి.... ఇద్దరు పిల్లలకంటె ఎక్కువ వద్దంటారుగా!.... అబ్బాయి పుడితే.... నేను...."

"ఊఁ-సువ్వు!"

"....అబ్బా నే చెప్పను!"

"ఆపరేషన్ చేయించుకుంటా నంటావు అంతేనా?.... హుఁ; అబ్బాయి పుట్టడం సంగతి ఎలావున్నా ఆపరేషన్ ఖాయమని ఎప్పుడో నిర్ణయమైపోయింది దేవుడు మొండివాడైతే మనిషి అంతకన్నా మొండి, శతమొండి! తెలుసా?" అన్నాడు సన్యాసి రాజు ఆమె చేతినున్న ఉంగరాన్ని చూపించి తనని చూపించు కుంటూ.

"ఏం కాదు" అన్నట్లుగా తల ఆడించింది అనూరాధ. తనకిమాత్రం అబ్బాయి అక్కర్లేదా?" అనుకొంది. అతని వేపు దొంగచూపులు చూసింది.

"మీ వాళ్ళింటికి పురుటికివెళ్తే ఏదో సాకుచెప్పి ఆపరేషన్ చెయ్యకుండా చూస్తారు. అందుచేత ఈమారు ఇక్కడే. గవర్నమెంట్ హాస్పిటల్లోనే;"

* * *

నెమ్మదిగా కళ్ళు విచ్చుకుంటున్నాయి.

అనూరాధకి కళ్ళు విడకముందే మనసు మేలుకొంది. మెలకువ రాక ముందే తెలివి వచ్చేసింది. చుట్టూవున్న జనాన్ని చూడక ముందే పొట్టమీద చేయివేసుకొంది........ అక్కడ మెత్తని చీరలేదు.... ఉవ్వెత్తుగా పొంగ లేదు....హాస్పిటల్ వారు కట్టిన ఏప్రన్ వుంది.... సర్జనమ్మ కుట్టిన కుట్లున్నాయి.

"సరిగా కనలేకపోయానా?" అనుకుంది. క్షణంలో సగం సేపు గడవక

ముందే నాకు మగబిడ్డ పుట్టాడాలేదా అన్న ప్రశ్నతో గిజగిజలాడింది. పుట్టే ఉంటాడు. దుడుకుతనంతో ఆయనగారు వలతంపడితే మట్టుకు.... దైవంలో దైవంలేడా?.... పుట్టేవుంటాడు.... పుట్టి.... ఉన్నాడా?.... అమ్మో!.... అంత బరువుండేవాడు. నాయన!.... వాడికేమీ కాలేదుకద!

ఆత్రుతతో కళ్ళుతెరచింది.... ఎదురుగా సన్యాసిరాజు.... పక్కనే వాళ్ళ నారాయణమ్మత్త. ఆమెచేతిలో పాప— ఏడాది వెళ్ళినా పేరులేని పాప.

"బాధగా ఉందా?" సన్యాసిరాజు ఆమె మీదికి వంగి అడిగాడు; ఎంతో దయగా, మెల్లిగా ఆమెని స్పృశిస్తూ.

తల అడ్డంగా వూపింది. చేతులు నెమ్మదిగా ప్రక్కలకు చాపింది.... నాబిడ్డ ఏడీ? నాకు మగబిడ్డ కలిగాడా?.... కలిగితే.... ఏడీ? ఈ పక్క ఖాళీగా ఉందేమీ?.... ప్రశ్నలు కళ్ళలో ప్రవేశించి వేదన కన్నీళ్ళ రూపంతో కన బడింది.

రెండు వేళ్ళు చూపాడు సన్యాసిరాజు. పక్కనే రెండు తొట్టెలున్నాయి. అటువేపు చూపించాడు. అతికష్టంగా తల తిప్పింది అనూరాధ.... మసక మసకలుగా కన్నీరు.... అసలేం కనబళ్ళేదు.

'ఇద్దరు....ఇద్దరు పాపలు' అన్నాడు సన్యాసిరాజు, ఆమె కళ్ళల్లో అసం తాంబరపు నీలి నీడలు చిమ్ముతున్న అశ్రువులు చూచి— అపరేషన్ చేయించేసి నందుకు—శతమొండిగా ప్రవర్తించినందుకు మొదటి సారిగా.బహుశా ఆఖరు సారిగా కూడా పశ్చాత్తాపపడ్డాడు. అంతలోనే 'ఎంత మూర్ఖత్వంలో పడిపోతు న్నాను? అని తన్నుతాను మందలించుకొన్నాడు.

చేతులు జాపింది అనూరాధ. పాప నారాయణమ్మ చేతుల్లోంచి వంగింది. నారాయణమ్మ వంగింది. అనూరాధ అందుకుంది. అంతలోనే బలం చాలక పక్క మీద పడేటట్లుగా వదిలేసింది.

'పాప, చిన్ని. బుచ్చి' అంది అనూరాధ నిర్జీవంగా నవ్వుతూ. 'మీ నాన్నగారు ముగ్గురికీ పెడతారమ్మా. పేర్లు.... మీ రంతాఊరూ పేరూలేని బిడ్డలు కారు....'

*